శ్రీరస్తు శుభమస్తు



# సాయి సచ్చరిత్ర

## (శుక్రవారం పారాయణ)

**ద్విపద పాఠ్యము :**

**రచన :**

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech



## రెండవ అధ్యాయము

శ్లో॥ నమోస్తుతే సాయినాధ! నమోరక్షప్రదాయకం
నమోభక్తపాలంచ షిర్డివాసా నమోస్తుతే

### బిచ్చమడిగేది భక్తి తిరిగి ఇచ్చేది ముక్తి

శుక్రవారము నాడు శోభతో వినుడు
చక్రవర్తీ సాయి చరితను చదువ

బిక్షమెత్తెను సాయి వీధులన్ తిరిగి
భిక్షకుండయ్యును రక్షించ జనుల

'రేకుడొక్కొ' క చేత రెండవ చేత
చేకొనె జోలెను చేరె వీధులను



అక్క! రొట్టిమ్మని అరుపు వింటూనె
ఒక్కసారిగ కూడియున్న స్త్రీలంత

తమ భాగ్యమట్లుగా తనరెడి శ్రద్ధ
విమలంపు మనసుతో వేతురు భిక్ష

ఒకతల్లి వేయును ఉన్న రొట్టెలను
ఒకతల్లి పోయును ఉన్నట్టి 'పులుసు'

ఐదారు ఇళ్లనే అడుగునాసాయి
అదె భాగ్యమని తల్చు అతివలందరును

'అల్లా భలాకరే' అనిజెప్పితాను
ఎల్లరన్ దీవించు ఈతీరు సాయి



నైవేద్యమిప్పించి నెనరుతో సాయి
అవిరళంబుగ బెట్టునన్ని ప్రాణులకు

కుక్కలు పిల్లులు గుంపుగామూగి
అక్కడ చేరగ అవియుదినేవి

మసిజీదు తుడిచేటి మహిళ ఒక్కామె
చేసిన శ్రమకునూ చేకొనున్ కొంత

ఎవరైన క్షుద్బాధ ఈసాయి జేర
తావచ్చి తినిపించు తను వారినెల్ల

మిగిలింది కలగల్పి మెతుకైనగాని
యోగీశ్వరుడుతిను ఉన్నంతముద్ద

రుచులతో పనియేమి రుచిలేనియోగి
తాచేయు నన్నిటిన్ తనుయోగి వోలె

జగతికాహారంబు సమకూర్చు వాడు
జగతి భిక్షను వేడ చక్కనౌ వింత

## కనరాని పాపం

తనకొరకేతిన తప్పురా ఎపుడు
వినరయ్య ఈ మాట విలువైనమాట

మనతల్లి అట్లన్న మనపుట్టుకేది
మనతండ్రి అట్టన్న మనుగడే లేదు

2.5

ఎంత సజ్జనులైన ఎరుకనందకనె
ఎంతెంతొ పాపము ఇల చేతురయ్య

కాంతలైనను గాని ఘనులైనగాని
వింతకాదిది సత్యమెంతయో కనుడు

దంచుచూ విసరుచూ తామూడ్చిగృహము
మంచిగా తోముచూ మంటనంటించి

కనలేని జీవులన్ కాల త్రొక్కుచును
మానవుల్ చంపేరు మాటిమాటికిని

ఆ పాపమెటుబోవు అందుచే వారు
ఎపుడునూ ఒరులకు ఇంతబెట్టాలి

2.6

అదిదినన్ పాపంబు అంటినన్గాని
వదిలించుకోజాలు పరమయోగులును

తముబెట్టి ఒరులకు దయజూచువారు
తమపాపముక్తులై ధన్యులౌతారు.

## మాటవినకపోతే అంతేమరి

సాయి మాటేకదా శాసనంబగును
చేయకాతీరుగ చింతయే మిగులు

షిరిడి కొచ్చుట మనచిత్తమేకాని
తిరిగి పోవుట సాయి దీవెనైనాకె

2.7

'తాత్యా' హఠాత్తుగా తాజూచి సాయి
అత్యవసరముగా అనుమతి అడిగె

'కోపరు' గ్రామము కొరకు 'టాంగా'ను
చేపట్టితినియంచు చెప్పె సాయికిని

**ఈరోజు పోకుము ఈ గ్రామమొదలి**
ఈ రీతి బల్కెను హితవును సాయి

పెడచెవిన్ పెట్టాడు వినలేదు మాట
వెడలెను 'టాంగా'లో వేగిరంబుగను

బెణికిన కాలితో వీధిలో నొరిగె
వాని గుర్రము దాన బడసె గాయాలు

2.8

సాయి మాటను వినిచరియించకుండి
గాయాలు మిగిలెను కడకు బుద్ధొచ్చె

యూరోపియను షిర్డికొకనాడు వచ్చి
ఈరీతిగా తాను హితమును వినక

గాయాలతో జేరె కడకు 'నాస్పత్రి'
సాయిమాటకు లేదు సరియౌజవాబు

రాబోవు ఆపదలను తెలియుటచె
తాబూని చెప్పును తగదంచు సాయి

వినకపోతే ఖర్మ విభునిదా తప్పు
విని కాచుకున్నచో వెలయును సుఖము

2.9

## మీర్ అయినా ఆజ్ఞ మీరరాదు

'బాంద్రా' కమీషను వ్యాపారి ఒకడు
సంద్రానపడువాని చందాన వేడె

ఆకథ తెలుపును ఆసాయి మహిమ
నీకైన నాకైన నిఖిలమెల్లరకు

'ఆమీరుషక్కరు' అను భక్తుడొకడు
తామూల్గి కీళ్లవాతంబుతో జేరె

చావడి నుండగా సాయి బోధించె
నవమాసములు అయ్యె నయముగాకుండె

2.10

అతని 'నమ్మిక జూడ' ఆసాయివేచె
అతడేమొ వ్యాపారి అవసరంబునకు

శరణార్థి, అయిననూ సాయి ఏమనడు
చిరునవ్వుతోవారి చిత్తుజేస్తాడు

చెప్పకుండగ బోయి చేరె'కోపరు'ను
ఎప్పటివలెజేరె 'ఎరుగు సత్రమున'

అతనితో నివసించెనట ఫకీరొకడు
అతివృద్ధుడాతడు అడిగె నీరమును

నీరంబు తాగిన నిముషంబులోనె
మరణించెనాతండు మారాడకుండె

2.11

తేలు కుట్టిన దొంగతీరు అమీరు
చలచల్లగాపారె చావడిచేరె

సాయికళ్లను గప్పసాధ్యమేకాదు
సాయి మాటను మీర సరికాదు ఎపుడు

## కాకాకి కబురు అందింది

'కాకామహాజను కడు భక్తుడతడు
ఒకనాడు వచ్చాడు బొంబాయినుండి

వారము రోజులు భక్తుని సాయి
షిరిడిలో గడుపగ చెప్పిరి తాను

2.12

**ఎపుడు పోయెదనయ్య ఇక్కడనుండి**
చెపుటకేమెరుగక చెప్పెనాతండు

**నీఆజ్ఞ ఓసాయి నేమీరగలన**
**నాఆశతెలియదా నామేలు నీకు**

చిరునవ్వుతో సాయి చెప్పెనీరీతి
**మరునాడు పోవయ్య మంచిది నీకు**

తను పనిచేసెడి తావు చేరగనె
వెను వెంటనే వాని పిలిచి చెప్పాడు

యజమాని ఈతీరు **అదృష్టమయ్య**
**నిజముగా షిరిడికి నీకోసమేను**

2.13

**వార్తపంపించాను వచ్చిచేరగను**
**వార్తలేకయె నీవు పనికి వచ్చావు**

ఆశ్చర్య చకితుడై ఆ మహాజనుయు
నిశ్చయించెను సాయి నిజదైవమంచు

పరమాత్మ సాయియే బాంధవుండతడె
షిరిడిలో నెలకొని చేసెను మంచి

ప్రాపంచికములైన పనులన్నిజేసె
ఆపైన మోక్షమునందించగలడు

మ్రొక్కువారందరు ముక్తికొౌరరుగ
చిక్కులు తీర్చును శ్రీ సాయి ఘనుడు

2.14

## ధుమాళ్ గారి వ్యధ

వెను వెంటనే పోవవీల్లేదటంచు
అనుమతీయడు సాయి ఆపు కొందరిని

పనిపై 'ధుమాళ' నే వాడు ఒక్కండు
తా'నిఫాడు'కుపోవుదారిలోరాగ

ఒకవారముండుటకొప్పించె సాయి
తాకూడ అటు చేసెదాసుండువోలె

న్యాయాధిపతితోటి నాపనియంత
ఆయెవ్యర్థము అని ఆతండు వగచె

2.15

కడుపు నొప్పితొ 'జడ్జి' కడుబాధజెంది
గడిపెను సమయముగృహమునే అంచు

తెలిసి అచ్చెరు వందెతెలిపె, సాయికిని
కొలిచి కృతజ్ఞతల్ కుదురుగా తెలిపె

**తల్లి మనసు దైవానికి తెలుసు**

శిరిడిలో భార్యతో 'శ్రీనిమోన్కరుడు'
స్థిరపడె కొల్చుచు శ్రీసాయినాథు

'బేలాపురి'న వున్న బిడ్డడు వ్యాధి
పాలైన వార్తను బడసిరివారు

2.16

తల్లడిల్లిన తల్లి తన భర్త నడుగ
వెళ్ళిరమ్మనె తండ్రి వెంటనే తిరిగి

భక్తురాలిని చూచి బాబా గ్రహించి
భక్తునికాజ్ఞగా పలికిరి ఇట్లు

నాలుగు రోజులు నయముగానామె
మేలుగా పంపించు మీకు మేలగును

మనసు తెలియువాడు మనసాయి అనుట
జనులందరెరిగిన సత్యంబు కాదె



## నీమొక్కులు నీవేచెల్లించుకో

ఆడిన మాటను ఆచరించనిచొ
వీడదు మనసాయి వింతైన లీలు

మొక్కుకోనేలరా? మున్నెన్నడైన
మొక్కితే తీర్చాలి ముందు ఆ బాస

సాయినాధుని తీరు చక్కగాతెలిసి
సాయికిచ్చిన బాస జరిపితీరాలి

'ఆత్మరాముని' భార్య అనుకొంది ఇట్లు
'ఆత్మరాముని' పేర అర్పించవలెను

సాయికి వంకాయ జతను అర్పించి
చేయించికూరయు చేయపచ్చడిని



షిరిడికి పోయెడి చెలియతో ఆమె
కొరి పంపించింది గుర్తుంచి తాను

ఒక్క వంకాయతో యువతి పచ్చడిని
చక్కగా చేసింది సాయికిచ్చింది

ఆపైన బాబాయె అడిగారు ఇట్లు
**వేపుడు కూరను వెంటనే తెండు**

పరుగుతో పడతికై భక్తులు పోయి
కూర తెచ్చిరి సాయి కోరి తిన్నారు

మహిమాన్వితునికేల మన కూరలన్ని
సహచరులార ఈజరిగింది లీల



'ఆత్మరాముని' భార్య ఆరీతి గానె
'ఆత్మరాముని' సఖుండైన మంకడుతొ

'కోవా'ను పంపించి కోరిందియాయ
కోవాను మరచెను గురుజూడబోయె

మొక్కెను సాయికి మొదట 'మంకడు'ను
**ఎక్కడ నాదని** హెచ్చరించారు

మరచిన 'మంకడు' మన్నించ కోరె
తిరిగి తెచ్చిచ్చాడు దేవుని వేడి

జరిగింది జరిగేది జరుగబోవునది
ఎరుగును మనసాయి హితులారవినుడు

ఆడితప్పిన పాపమంటును గాన
కూడిమొక్కును పొందు గుర్తుచేయుచును

## జీవకరుణలేక జీవించనేల?

అపరాహ్ణవేళలో అల షిర్డిలోన
ఆపక మొరిగెను ఆకలి కుక్క

అదిచూసి'తర్ఖడు' అనువాని భార్య
అందించెజాలితో అట 'రొట్టె'ముక్క

ఆనాటి సాయంత్ర మామెతో సాయి
తినిపించు తల్లికి దీవెనల్ అనగ

2.21

**నే పేదరాలను నేనెట్లు నీకు**
**ఎపుడుబెట్టితినయ్య ఇష్టభోజనము**

అనుచున్న ఇంతితో ఆసాయి అనిరి
**శునకంబు రూపాన జొచ్చి నీయింట**

**ఈరోజె నేతింటి ఇష్టమౌరొట్టె**
**చేరితిన్నానునీచేతితో నేను**

అచ్చెరువును పొందు ఆమెతో సాయి
ముచ్చటగానవ్వి ముదముతో అనిరి

**ప్రతిప్రాణి లోనున్న పరమాత్మగసుడు**
**ప్రతిలేని నిజమిదె పరికించరమ్మ**

2.22

**నేనొత్తునొక రోజు నిన్నన్నమడుగ**
**ఆనాడు గుర్తించనవదు సాధ్యంబు**

**జీవకరుణలేక జీవించువారి**
**జీవనంబదియేల చెప్పేది నిజము**

సాయిబోధను విన్న జరుగును శుభము
సాయినాధుని మాట చక్కనౌబాట

2.23

## ఆయనశయనం అద్భుతం

శేషశయనమెట్లు చేయునా హరి? వి
శేషించి యేరికిన్ చెప్ప సాధ్యంబె

ఆరీతి మన సాయి అల షిర్డిలోన
ఆరోజు చేశారు ఆ గాధ వినుడు

భక్తులిద్దరు సాయిబాబాకు మొక్కి
భక్తినర్పించారు బల్లనొక్కంటి

నాలుగు 'మూరలు' నయముగా పొడవు
మేలుగా అడ్డము మించదు 'అడుగు'

2.24

ఊయలబల్లగా ఒనరించి దాని
చేయబూనిరి సాయి చిత్రముగనుడు

పీలికల్ ముడివేసి పేలికల్ కూర్చి
ఏలాగొచేశారు హితులెల్లచూడ

ఆ బల్లనేరీతి ఆపీలికలును
ఆ బరువును మోసె ఆదెయొక్క వింత

నాలుగు మూలల నాల్గుదీపాలు
వెలిగించి పెడుదురు వింతైన రీతి

దానిపై శయనించు దైవమున్ జూడ
కనులకాశ్చర్యంబు కాదె ఆ వింత

2.25

అష్టసిద్ధులు కల్గు ఆ సాయిబాబ
కష్టాలు తొలగించు గట్టెక్క జేయు

ఆమహిమలు జేయ అన్యుల కిలను
ఏమాత్రమౌనొ మీరెరుగుడు, చదివి

చేరుచు మూకగా చీకాకు చేయు
వారల గొడవను పడలేక సాయి

ఆబల్లపారేసి ఆనాటినుంచి
ఏ బాధలేకుండ ఇచ్చునున్నారు

2.26

## శస్త్ర వైద్యుడు సాయిబాబా

వైద్యుడైమనసాయి వింతరోగాల
వేద్యుడై దీర్చాడు వింతగానాడు

శస్త్రమే లేకుండ చక్కజేశారు
శాస్త్రకారులనెల్లచకితులన్ జేసి

వారివైద్యము చూచువారిదే ‘పంట’
వారి వింతలు చూచు వారలే ఘనులు

కరుణించమని వచ్చె క్షయరోగి ఒకడు
షిరిడికి ‘భీమాజ’ చినవాడిపేరు

2.27

రక్తము కక్కుచూ రక్షనిమ్మనుచు
భక్తుని చూచెను పలికెనాసాయి

**భీతిల్ల వలదయ్యబెంగొద్దునీకు**
**నేతీర్తు నీబాధ నిన్నురక్షింతు**

**ఈ మసీదుననున్న ఈ ఫకీరునకు**
**నీమీద దయకల్గె నీఅండనుండు**

**నాభక్తుడా వ్యాధి  నయమౌనునీకు**
**ఏభయంరానీకు ఇదినాదు ఆజ్ఞ**

గంటకో సారైన కక్కు రక్తమ్ము
వెంటనే ఆగింది వింతగా అపుడు

2.28

విడిది రోగిష్టికి వీలుకొనట్లు
కడగినా, ఎదురాడగలవారు కలరె

కలలోనగురువుగా కనిపించెసాయి
నిలబెట్టికొట్టెను నేరంబు చెప్పి

ఒప్పగించుటరాదు ఒక్కపద్యమైన
తప్పదు శిక్షించు దండించెవాని

వేరొక్క స్వప్నము వింతైనదదియు
వారొక్క బండను వైచి కొట్టారు

ఛాతిపై బండను సాయి పొర్లించి
ఆతని బాధను అపుడు దీర్చారు

2.29

నయమైన భక్తుడు నాదేవుడంచు
సాయికిమొక్కెను చనెనింటికతడు

'భీమాజి' భక్తుడై వింతైనరీతి
ఆ మహనీయుని అర్చించదలచె

సత్యనారాయణు చక్కటి వ్రతము
ప్రత్యేకముగ 'సాయివ్రతము' గా మార్చె

నేటికీజరుపుచూ నిజభక్తులంత
దీటుగా కోర్కెలన్ తీర్చుకొంటారు

2.30

## ఎవరికి సాధ్యం ఈ వైద్యం

సాయి మహిమ తెల్ప సాధ్యమే కాదు
అయిననూ చెప్పెద అయినంత వరకు

నేటికీ 'స్పెషలిష్టు' నెరపంగలేక
'కాటి' చేరేదాక 'కాదని' అనడు

ఇటువంటి వైద్యుని ఎవరు చూశారు
ఇటువంటి స్పెషలిష్టు నెవరు చేరారు

గణపతిషిండేని కాపాడె సాయి
వణికె మలేరియా బాధించనతని

2.31

శ్రీలక్ష్మి గుడిలోను చేరిఈనాడె
కలదొక్క శునకము కడు నల్లదదియె

పెరుగన్నమును పెట్టు ప్రేమగా నీవు
తరుగునూ జ్వరమెల్ల తగ్గనీబాధ

తగ్గించు కొనెవాడు తనవ్యాధినట్లు
నెగ్గువిశ్వాసంబు నీకైన అటులె

నల్ల జీడీగింజ నజ్జుగాకొట్టి
కళ్ళలో బెట్టగా కలికంబులాగ

ఎఱ్ఱబడిన కళ్ళు ఈవైద్యమంది
ఎఱ్ఱదనము వీడి ఎట్లు బాగయ్యె

2.32

తెలియ సాధ్యంబౌనె దివ్యులకైన
ఇల పుట్టు మనబోంట్లు ఎరుగుదురెట్లు

'బలరాం'గారి ఉబ్బసమునుకూడ
చిలుమును పీల్పించి చేశారు నయము

పొగత్రాగమను వైద్యు పొడగనగలరె
జగతిని వెదికినా జనులు ఏనాడు

ఇదిఏమి వైద్యము ఇటు వ్యాధులన్ని
వదిలించు వారెగా వసుధలో జేజె

'బుట్టీ' కి 'కలరా' యె పోయిందివింత
అట్టి వైద్యుని చూడ అవనిలో అవునె

2.33

బాదాము అక్రోటు పాలుచెక్కరలు
కుదిరించి పిస్తాతొ కొట్టి 'గుండ'గను

ఇది ఏమి మందని ఇతరులు అనిన
ముదముతో చేకొనె మొక్కి భక్తుండు

'కలరా'విముక్తుడై ఘనముగా 'బుట్టి'
కొలిచెను సాయిని గురురాజునంత

'కాకామహాజను' ఘనుడు భక్తుండు
సకలంబు నీవని సాయిని నమ్మ

వారి, విరేచన వ్యాధిని సాయి
వేరుశనగపప్పు వైద్యంబు జేసి

2.34

తరమె వేరికినాన తగ్గించనటుల
షిరిడి వాసుని లీల చిత్రంబుకాదె

**"నీ వ్యాది తొలగెను నిశ్చింత నుండు"**
ఆ వ్యాధి కా 'ఆజ్ఞ' ఆ సాయి మందు

బాబా ఒసగినదె పరమౌషధంబు
చెబుదునామందని చెప్పుట ఎట్లు

ఆశీర్వచనమేగ ఔషధంబగును
ఆశీస్సులేకుండ అప్రయోజనము

'సోనాముఖీ' ఆకు చూర్ణకషాయ
మును యిచ్చె శ్రీసాయి 'మూల' వ్యాధికిని

2.35

మాధవరావుకు మళ్ళింది నాడె
వ్యాధి వింతగ సాయి మహిమ అన్నట్లు

అదె వ్యాధి మరలొచ్చె ఆ మందె త్రాగ
కుదరదు వానికి గుణమియ్యబోదు

మందులో ఏముంది మహిమ యోచించ
ఉందయ్య ఆ మాయ ఉన్నతునందె

'ఆళంది' సన్యాసికౌ చెవిపోటు
మేలు చేసెను సాయి మిత్రు దీవించి

'అల్లా భలాకరే' ఆ మాటతోనె
చల్లంగ బ్రోచారు సాయి ఆనాడె

2.36

చెవిపోటు తగ్గుచు సేదతీరంగ
ఆవింత లేఖలో అతనె వ్రాశాడు

'ఊదీ' తొంతగ్గించి ఉదరాన నొప్పి
వేదనన్ తీర్చారు వింతగా సాయి

చేరె 'దత్తోపంతు' సేవకుండయ్యె
షిరిడి దేవునికిని చిరకాలమతడు

'గంగాధరుడు పంతు కడుపునొప్పియును
క్రుంగించగా సాయి కుదిరించినారు

ఆశీస్సుతో నాడు ఆశ్చర్యమయ్యె
చేశారు మంచిని షిరిడిలో సాయి

2.37

సంతానమొందని 'సాఠెహరి' కిని
కాంతా వియోగమై కలతనుండంగ

షిరిడి దేవుని వాడు చేరి కొల్వంగ
'మరియొక్క పెండ్లి తో' మగ బిడ్డ కలిగె

## బల్లి భాష తెలిపిన బాబా

బల్లియైనా గాని పిల్లియౌగాని
ఉల్లంబునెరిగిన యోగి ఆ సాయి

వేలాది గాధలు వింతలు తెలిసి
వేలాది భక్తులై విభుని కొల్చారు

2.38

ఈ వింత వినినంత ఇది నిజంబంచు
ఎవరైన నెరుగరా ఈ సాయి మహిమ

ఒకనాడు సభలోన ఒక బల్లి "అరచె"
ఒకడతి తెలివితో **ఓ సాయి దెలుపు**

**ఆ బల్లి అరుపుకు** అర్ధమ్ము అనెను
తా బదులిచ్చెను తగునట్లు సాయి

**'ఔరంగ బాదు' లోనున్న నా చెల్లి**
**ఈ రోజు వస్తుంది ఈ అక్క జూడ**

ఇంతలో అటజేరె ఎల్లరు జూడ
వింతగా అశ్వంబు వేగంబుగాను

2.39

**రౌతు విశ్రాంతికై రవ్వంతసేపు**
ఆ తావు నాపాడు హయముకు గడ్డి

వేయనై సంచిని వెలికి తీశాడు
ఆయన విదిలించె ఆ సంచినపుడు

ఒక బల్లి పడిక్రింద ఉరికింది తాను
చక చకా కలిసింది జంటగా అపుడు

షిరిడిలో బల్లిని చెల్లెలి వోలె
తిరిగింది ఒకటిగా తెలిపి సంతసము

మనసాయి భక్తుడు మాటలు లేక
తను రాయిలా మారి దయవేడి నాడు

2.40

షిరిదిలో బల్లిని చేరినబల్లి
ఔరంగబాదుదే అగుట వింత కద

పశుపక్ష్య మాటలూ భాషలూ అన్ని
విశదంగ తెలియును వింతేమి లేదు

మనసాయి దేవుడు మనిషికాదంచు
మనకిది తెలుపును మనసాయి మహిమ

## లెక్క బాబా పక్కా

'రతనుజీ వాడియా' లక్షాధికారి
అతనెట్లు భక్తుడౌ ఆ గాధ వినుడు

'నాందేడు' వాసికి నట్టింట సిరులె
పొందలేదాతడు పుత్రసంతతిని

2.41

'దాసుగుణుని' బోధ తలదాల్చి అతడు
చేసె షిర్డీయాత్ర చేరె బాబాను

అయిదు రూపాయలు అయిన దక్షిణతొ
ఈయబడినవయ్య ఇది ముందె నాకు

అరువది రెండుగ అయిన అణాలు
తీరిచి నావయ్య తెలియును నాకు

పదినెనిమిది నాకు బాకీగ మిగిలె
ముదముగా చెల్లించు మదినాకు చాలు

దక్షిణ చెల్లించి దయ పొంది అతడు
లక్షణమ్ముగ వీడె 'రతనుజీ' షిరిడి

2.42

పాతలెక్కలు చూడ 'వాడియా' గారు
'కాతా' ఒకటి చూచి కంగుతిన్నారు

షిరిడి పోవుటకును చేసి నిశ్చయము
అరుదెంచె ఒక 'మౌల' ఆ సాహెబుకును

ఖరుచయ్యెననియుండె కాతాయు అచట
అరువది రెండుగ అయిన అణాలు

తెలిసెను 'రతనుజీ' దివ్యమౌలీల
తలవంచి మొక్కెను దయవేడి గురుని

అనతి కాలంలోనె ఆ 'రతన్‌జీ' కి
తనవంశ వృద్ధికై తనయుడు కలిగె

2.43

నమ్మిన వారికి నయమొసంగేటి
అమ్మహాయోగికి అర్పింతునన్ని

## చక్కెర లాంటి సాయి మాట

'చోల్ కరు' అనువాని చూశారు సాయి
ఆకడ ఆ గాధ అత్యద్భుతంబు

**అతిపేదవాడిని అల్లాడుచుంటి**
**బ్రతుకంగ 'సర్కారు' పని ఇమ్ము స్వామి**

2.44

**షిరిడీకి వత్తును చేతు దర్శనము**
**కరుణించు నీ పేరకలకండనిత్తు**

ఆతని కరుణించె ఆసాయి అట్లె
ఆతడు ఉద్యోగి అయి మొక్కుదీర్చ

చనుటపై షిరిదీకి చక్కెర నతడు
తనతేనీటిలో త్యజియించినాడు

కూడబెట్టిన డబ్బు గొంపోయివెంట
వాడు షిర్డీ చేరి బాబాను చూచె

'భావు' ఇంటిలో చేరె వాడు షిర్డీలో
భావుతో అన్నారు బాబాయు నవ్వి

2.45

**నీ అతిథికిని తేనీట ఎక్కువగ**
**నా ఆజ్ఞ చక్కెర నయముగానిమ్ము**

పదమంటి సాయిని భక్తుడు మొక్కి
వదలడే కన్నీరు వరదలై పార

ఇటువంటి లీలలు ఎరిగించు మనకు
దిటవుగా ఈ సాయి దేవుడే సుమ్మి

## గోధుమపిండితో కలరా ఉపశమనం

విసిరిరి గోధుమల్ విభుడొక్కసారి
చేసిరి రక్షను షిరిది వాసులకు

2.46

అతివలు బాబాను ఆపిరి తాము
అతి భక్తి విసిరారు అంత గోధుమలు

హేమాడు ఆసాయి ఇట్లుజేయుటకు
ఏమికారణమని ఎరుగ గోరియును

సాయిని అడుగన్నై సాహసించకనె
సాయి భక్తుల గోరె సవివరమంత

షిరిడిలో 'కలరా'ను క్షీణింపజేయ
గోరుచూ జల్లేరు గోధుమపిండి

2.47

పిండికి కలరాకు వింతసంబంధ
ముండునా అనిజేయు యోచనలేల

సాయిమాటే ఆజ్ఞ చక్కగా జేయ
సాయి చూచును అన్ని సద్గురువగుచు

గురువె తల్లియు దం(డ్రి గురువెదైవంబు
గురువె జ్ఞానజలధి కూడించు మనకు

గురువులకెల్లతా గురుడైన సాయి
తరియింపజేయురా ధన్యులన్ జేసి

**రెండవ అధ్యాయము**
**శ్రీసాయినాథార్పణమస్తు**
**ఓం నమో భగవతే సాయినాథాయ**

❊ ❊ ❊

2.48